*మే 1వ తేదీ మధు లిమాయ్, మధు దండవతే గార్ల శతజయంతి సంవత్సరం సందర్భంగా...*

# ఇద్దరు 'మధు'ల స్మృతిలో

హిందీ మూలం - **రఘు ఠాకూర్**

తెలుగు అనువాదం – **అరుణా ప్రసాద్**

మహారాష్ట్రకు చెందిన కొందరు నేతలు భారతీయ సోషలిస్టు ఉద్యమంలో ప్రముఖులు. నిజానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పుట్టిందే మహారాష్ట్రలో. ఏదేమైనా 1950ల తర్వాతి కార్యకర్తలు చాలామందికి యిద్దరు మధులతో బాగా పరిచయం ఉంది. అంతేకాదు, వారిద్దరూ రాష్ట్రంలో కంటె రాష్ట్రం బయటే ప్రసిద్ధులు.

1973వ సంవత్సరములో అనుకుంటా ... మధులిద్దరూ మధ్యప్రదేశ్‌లోని మా ఊరు సాగర్‌లో జరిగిన 'సోషలిస్టు యువజన సభ' కు హాజరైనప్పుడు నాకు వారిద్దరితో పరిచయం కలిగింది. మధు దండావతేగారు ఆ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించగా, మధు లిమాయేగారు ముగింపు ఉపన్యాసం యిచ్చారు. మేం వి.సి.జైన్ ధర్మశాలలో వారిద్దరూ బస చెయ్యడానికి ఏర్పాట్లు చేసాం. ఆ సందర్భంగా వారిద్దరిలోనూ ఉమ్మడిగా ఉండే లక్షణాలను దగ్గర నుంచీ పరిశీలించే అవకాశం నాకు దక్కింది. వారిద్దరూ ఒకదానికొకటి ఎదురుపడి, ఒకదాన్నొకటి దాటి తిరిగి కలిసి ప్రవహిస్తూ సముద్రాన్ని చేరిన రెండు నదుల వంటివారు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో కలిసి ఉత్సాహంగా పనిచేసిన వారిద్దరూ తమ తమ స్వభావాల కారణంగా వేర్వేరు రాజకీయ పార్టీలలో చేరి మళ్ళీ తిరిగి ఒకే గూటికి చేరారు. వారిద్దరి స్వభావాలతో ఎన్నో పోలికలున్నప్పటికీ వ్యక్తీకరణలోను ఆచరణ విధానంలోనూ యిద్దరూ భిన్నంగా ఉండేవారు.

అంచేత 1948-55 మధ్యకాలంలో సోషలిస్ట్ పార్టీలో కలిసి పనిచేసిన వారిరువురు ఆ తరువాత ......లోనూ .....లోనూ చేరి విడిపోయారు. మళ్ళీ 1971లో సోషలిస్టు పార్టీలో చేరటం ద్వారా కలిసినవారు 1979లో తిరిగి జనతాపార్టీ, లోక్‌దళ్‌లలో చేరటం ద్వారా విడిపోయారు. జనతాదళ్ ఏర్పాటు సమయంలో వారిద్దరూ మానసికంగా ఏకమయ్యారు. వారిద్దరి స్వభావాలలో గల ఉమ్మడి లక్షణాలను నేను దిగువన యిస్తున్నాను.

**1. నిరాడంబరత :** ఇద్దరూ ఎంతో నిరాడంబరులు. ఒక సాధారణ కార్యకర్త కూడా ఏ రకమైన సంకోచం లేకుండా వారిని కలిసి అతి సాధారణ విషయాలను చర్చించగలిగేవాడు. గొప్ప నాయకులకుండే హంగు, ఆర్భాటం, భేషజం, వారివద్ద మచ్చుకైనా కనిపించేది కాదు. అదే విధంగా మేధావులు కూడా వారి వద్దకు వెళ్ళి లోతైన చర్చలు చెయ్యగలిగేవారు. సాధారణ కార్యకర్తలకు వారు తమ వంటి కార్యకర్తలుగా కనిపిస్తే మేధావులు వారిలోని పాండిత్యాన్ని గుర్తించగలిగేవారు. మధు దండావతేగారు శిక్షణ శిబిరాన్ని సందర్శించినపుడు తన దుస్తులు తనే ఉతుక్కునేవారు. అతను తనతో కేవలం ఒక చిన్న సంచి మాత్రమే తెచ్చుకునేవారు. ఇక మధులిమాయేగారి విషయానికి వస్తే అతని సంసారమంతా ఒక చిన్న పెట్టెలో పట్టేదే.

**2. స్థిరమైన విశ్వాసాలు :** తమ విశ్వాసాల పట్ల స్థిరత్వంలో వారికి వారే సాటి. వారెన్నడూ సోషలిస్టు జీవన విధానాన్ని వీడలేదు. జవహర్‌లాల్ నెహ్రూగారి నాయకత్వంలోని బలమైన కాంగ్రెస్‌పార్టీగానీ, లేదా 1971 లో శ్రీమతి ఇందిరాగాంధీ నేతృత్వంలోని అత్యంత శక్తివంతమైన కాంగ్రెస్ పవనాలుగానీ వారిని వారి విశ్వాసాలకు దూరం చెయ్యలేకపోయాయి. నెహ్రూ, ఇందిరాగాంధీ లిరువురూ ఈ విషయాన్ని స్వయంగా గుర్తించారు. 1971 ఎన్నికల్లో భారీఎత్తున విజయం సాధించిన శ్రీమతి ఇందిరాగాంధీని మీరెలాగూ సోషలిస్టు విధానాలు అనుసరించాలను కుంటున్నప్పుడు మధులిమాయెగారిని మంత్రివర్గంలోకి ఎందుకు తీసుకొనగూడదు? అని ఎవరో ప్రశ్నించగా అతన్ని ఏ శక్తీ ఆకర్షించలేదనీ ఆమె జవాబిచ్చారు.

**3. ఆదర్శవంతమైన సోషలిస్టు విధానం :** మధులిద్దరూ ఆదర్శమైన జీవితాలను గడిపారు. వారి సామాజిక జీవనానికీ, వ్యక్తిగత జీవితాలకూ పెద్ద భేదమేమీ లేదు. వారిద్దరూ కబీరు

వంటి జీవితాన్ని గడిపారు. తనకిచ్చిన వస్త్రాలను మలినం చెయ్యలేదని దేవునికి చెప్పిన కబీరు మాదిరే వారి జీవితాలు కూడా గడిచాయి. పుట్టుకతో పవిత్రులైన వారిరువురూ చివరివరకూ పవిత్రులుగానే ఉన్నారు.

**4. అధ్యయనం పట్ల ఆసక్తి :** ఇరువురూ అధ్యయనానికి సరిపడా సమయం కేటాయించేవారు. ఎంతగా వ్యవహారాల్లో తలమునకలుగా ఉన్నా, తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారు. అలవాటు ప్రకారం వారు రోజు కొంత సమయాన్ని చదువుకు, రాతకూ కేటాయించేవారు. దండావతేగారు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కాగా లిమాయెగారు శిక్షణ పొందని  ఉపాధ్యాయుడు. లిమాయెగారిని నడిచే గ్రంథాలయము అని చెప్పొచ్చు. అతన్నించి ఎవరైనా, ఎప్పుడైనా ఏ రకమైన సమాచారం కావల్సినా పొందగలిగేవారు (తారీఖులతో సహా). దండావతేగారు సున్నితమైన హాస్యంతో జవాబిచ్చేవారు. అంచేత అతను చెప్పేది తొందరగా మనసులోకి వెళ్ళేది. కాగా లిమాయెగారు సాధారణంగా ఎంత పెద్దవారి గురించైనా, లేదా ఎంత గొప్ప తత్వం గురించైనా శ్రోతలకు అర్థమయ్యేట్టు సూటిగా, సరళంగా చెప్పేవారు. అతను స్వభావరీత్యా మంచి విశ్లేషకుడు. గొప్ప తాత్వికుడు. దండావతే మంచి చతురతతో ఎంతటి చేదు నిజాన్నైనా కాస్త మధురంగా చెప్పగలిగేవాడు. కాగా లిమాయెగారు అది చేదు మందు అని హెచ్చరించి మరీ రోగి చేత యిష్టంగా చేదుమందుని మింగించగలిగేవారు.

**5. ఋషుల మాదిరి జీవితం :** ఇద్దరూ ఋషుల వలె నిరాడంబరముగా జీవించేవారు. గుండెపోటుకి గురయ్యాక, లిమాయెగారిని ఎయిర్ కండిషనర్ ఏర్పాటు చేసుకొమ్మని అతని సన్నిహితులు బలవంతపెట్టినా, అతను అంగీకరించలేదు. అతను చివరి వరకూ తనకంటూ కారు లేకుండానే బ్రతికారు. అతను ఆటోరిక్షా మీదనో, లేదా మోటార్‌సైకిల్ మీదనో ప్రయాణం చేసేవారు. అతనికి తన లక్ష్యమే ముఖ్యం కానీ సౌకర్యాల కోసం ఎన్నడూ వెంపర్లాడలేదు. దండావతేగారి ఆలోచన, జీవనశైలి కూడా యిదే విధంగా ఉండేవి. అతను కూడా స్కూటర్ లేదా ఏదో ఒక వాహనాన్ని ఉపయోగించేవారు.

కొన్ని విషయాలు, సిద్ధాంతాలకు సంబంధించి మధులిమాయె హఠయోగిలా బాగా మొండిగా ఉండేవారు. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పొందిన నాయకుడికి రాజ్యసభకు వెళ్ళే హక్కు లేదని అతను బలంగా విశ్వసించేవారు. ఈ పద్ధతిని దొడ్డిదారిన ప్రవేశించడం అని లోహియాగారు విమర్శించేవారు. 1980లో లోక్‌సభ ఎన్నికల్లో మధులిమాయెగారు ఓడిపోయిన అతన్ని రాజ్యసభకు వెళ్ళమని చాలామంది నాయకులు సూచించారు. చౌదరి చరణ్‌సింగ్‌గారు స్వయంగా నచ్చజెప్ప చూసారు. కానీ లిమాయె ఒప్పుకోలేదు. 1991లో సార్వత్రిక ఎన్నికల్లో పరాజయం పొందేక దండావతేగారిని కూడా రాజ్యసభకు వెళ్ళమని చాలామంది అభ్యర్థించేరు. కానీ అతనికి ఎన్నడూ అటువంటి కోరిక లేదు. సోషలిస్టు సిద్ధాంతాలు ఉపదేశించడం సుళువు. కానీ ఆచరించడం చాలా కఠినమైన వ్యవహారం. కానీ మధులిద్దరూ సోషలిస్టు సిద్ధాంతానికి కట్టుబడి తమ జీవితాలను సాగించారు. బీద, గొప్ప, పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా అందరినీ సమదృష్టితో చూశారు.

**6. స్త్రీ, పురుష సమానత్వం :** వారు కేవలం ఈ సిద్ధాంతాన్ని నమ్మడమే కాదు, ఆచరించి చూపించారు. ఈ జంటలు రెండూ దేశ రాజకీయాల్లోనూ, సామాజిక జీవనంలోనూ ఆదర్శమైన జంటలుగా నిలిచాయి. వారు పూర్తిగా ఒకరికొకరు అంకితమై జీవించారు. బూజుపట్టిన ఫ్యూడల్ ఆలోచనలు వారిలో మచ్చుకైనా కనిపించేవి కావు. వారు కేవలం భార్యాభర్తలే కాదు, మంచి స్నేహితులు. చేతిలో చెయ్యి వేసి నడిచిన కామ్రేడ్స్. ప్రమీలగారు తన భర్తకి రాజకీయాల్లోనూ, ఎన్నికల్లోనూ కూడా సహధర్మచారిణిగా ఉండేవారు. కాగా చంపగారు తన భర్తతో రాజకీయ జీవితాన్ని పంచుకున్నారు. కానీ, ఎన్నికల సమయంలో కేవలం వలంటీర్‌గా మాత్రమే పని చేసేవారు. మధుగారు చంపగారికి వంటింట్లో సాయం చేస్తే, ఆమె అతనికి రాజకీయాల్లో సాయపడేవారు. తమ తమ భార్యల స్వతంత్ర వ్యక్తిత్వాల పట్ల మదులిద్దరికీ చాలా గౌరవం ఉండేది. దండావతేగారు ప్రమీలగారిని తన అనుచరురాలిగా కాక ఒక స్వతంత్ర వ్యక్తిగా గుర్తించేవారు. లిమాయె, చంపగార్ల వ్యవహారం కూడా ఇలానే ఉండేది. వారు నైతిక విలువలతో కూడిన జీవితాలను గడిపేవారు. తమ సిద్ధాంతాలను ఆచరించి

చూపించేవారు. మధులిద్దరూ ఎన్నడూ పిడివాదనలు చేసేవారు కాదు. వారిని చూసినవారు వారి ప్రవర్తన, జీవన విధానాన్ని చూసి అబ్బుర పడేవారు.

**7. సంపద గూర్చిన ఆలోచనే లేదు :** సంపద పోగు చేసుకోవడానికి వారికి ఎన్నో అవకాశాలు వచ్చినా, వారు ఎన్నడూ ఆ దిశగా కన్నెత్తి కూడా చూడలేదు. సమాజం నుంచి నీకు అవసరం అయినంత తీసుకోవడం, నీకు చేతనైనంత సమాజానికి తిరిగివ్వడం అనే సోషలిస్టు సిద్ధాంతానికి వారు కట్టుబడి ఉండేవారు. దండావతేగారు కాస్త మర్యాదగా ఉండే తిరుగుబాటుదారుడు. అయితే లిమాయెగారు కాస్త కోపిష్టి, తిరుగుబాటుదారుడు. వారి కార్యాచరణలోని ఈ తేడాకు కారణం బహుశా వారు పనిచేసిన ప్రదేశాలు, అక్కడి అవసరాలు, వారి భిన్నమైన రాజకీయ కార్యాచరణలు అయి ఉండొచ్చు. లిమాయెగారు బీహార్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తే, దండావతేగారు మహారాష్ట్ర నుంచి లోక్‌సభకు ప్రతినిధిగా ఉన్నారు. బీహార్ నుంచి అప్పుడప్పుడే పైకి వస్తున్న వెనుకబడిన వర్గాల ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవడం అవసరం. కాగా మహారాష్ట్రలోని స్థిరమైన రాజకీయ వాతావరణం అక్కడి మధ్యతరగతి ఆలోచనా ధోరణిని ప్రతిబింబించేది. అంచేత దండావతేగారు చివరివరకూ ఒకేపార్టీలో కొనసాగాల్సి వచ్చింది. అదే కట్టడంలో ఉంటూ, దాన్ని పడిపోనివ్వకుండా మరమ్మత్తులు చేస్తూ ఉండాల్సి వచ్చింది. కాగా లిమాయెగారు తన రాజకీయ లక్ష్య సాధన కోసం రకరకాల ప్రయోగాలు చేయాల్సి వచ్చింది. తను ఉన్న వ్యవస్థ తన లక్ష్య సాధనకు సరిపోదని అతనికి తోచినప్పుడల్లా అతను దాన్ని పునర్నిర్మించే ప్రయత్నం చేశారు. పాడుబడ్డ యింట్లో కూడా దండావతేగారు విప్లవకారుడిగా జీవించగలిగితే తన విప్లవం కలలను సాకారం చేసుకునేందుకు లిమాయెగారు కొత్త కట్టడాలను నిర్మించారు. ఇవి ఒకే ఆలోచన విధానానికి భిన్న వ్యక్తీకరణలు. దండావతేగారు ఒకే రాజకీయపార్టీని నమ్మడం, లిమాయెగారు ఒకే ఆలోచనా విధానానికి కట్టుబడి ఉండడం అనేవి ఒకే నాణానికి బొమ్మా, బొరుసూ వంటివి.

8. దండావతేగారు తన కోపాన్నీ, ఆవేశాన్నీ అదుపులో ఉంచుకోగలిగేవారు. లిమాయెగారు పెలిగ్రక్కేవారు. ఇద్దరిలోనూ ఆ కోపం మాటున అపారమైన దయ, కరుణ దాగి వుండేవి. లిమాయెగారు ఒక కార్యకర్తను కఠినంగా మందలించి వెంటనే అతనికి తను స్వయంగా కాఫీ చేసి యిచ్చేవారు. మనసులో ఎంత కోపంగా ఉన్నా, దండావతేగారు ఒక వ్యక్తి బాగోగులు కనుక్కోవడం మరిచేవారు కాదు. అతను కోపాన్ని దిగమింగి దయ, సానుభూతి చూపిస్తే లిమాయెగారు కోప్పడి తరువాత దయ, సానుభూతి చూపేవారు.

9. **పార్లమెంటరీ వ్యవహారాలు :** ఇద్దరూ గొప్ప పార్లమెంటేరియన్స్. లిమాయెగారు పార్లమెంటరీ నియమ, నిబంధనలలో దిట్ట. అతను తన ఈ జ్ఞానాన్ని తన లక్ష్య సాధనకు ఉపయోగించేవారు. ఏదైనా విషయాన్ని పార్లమెంటులో మళ్ళీ, మళ్ళీ లేవనెత్తి ప్రభుత్వం మెడలు వంచి ఆ పని ఎలా చేయించాలో అతనికి బాగా తెలుసు. ఈ రోజుల్లో పార్లమెంటు నుంచి వాకౌట్ చెయ్యడం ఎంత సాధారణం అయిపోయిందంటే ప్రజలు దాన్ని చూసి నవ్వుకుంటున్నారు. కానీ కొన్నిసార్లు పార్లమెంట్‌ను బాయ్‌కాట్ చెయ్యడం అనేది లక్ష్యసాధనకు ఎంచుకునే తెలివైన మార్గం. చర్చలోనూ, ఓటింగ్‌లోనూ పాల్గొనడం అనేది సభ్యుల బాధ్యత. కానీ ప్రస్తుత కాలంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బాయ్‌కాట్ నాటకాలు వెయ్యడంలో పోటీలు పడుతున్నాయి. తద్వారా అధికారపార్టీ తన తీర్మానాలను ఆమోదింప చేసుకోగలిగితే, ప్రతిపక్ష పార్టీ తమ వ్యతిరేకతను తెలియజేసే నెపంతో తను కర్తవ్యాన్ని విస్మరిస్తోంది. ఈ రకమైన కుట్రల వలన నిజంగా తిరస్కరించబడాల్సిన ఎన్నో తీర్మానాల ఆమోదించబడుతున్నాయి. పేటెంట్ సవరణ చట్టం అలాగే ఆమోదించబడిరది. పార్లమెంట్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన గళాన్ని బలంగా వినిపించాలని లిమాయె భావించేవారు. అతను సస్పెండ్ అవటానికైనా సిద్ధపడేవారు కానీ బాయ్‌కాట్ చేసి పోరాటాన్ని మధ్యలో వదిలేసేవారు కాదు. పార్లమెంట్‌లో దండావతేగారి ఉపన్యాసాలు వాస్తవాలతోనూ, వాదనలతోనూ నిండి ఉండేవి. అతను అభ్యంతరం చెప్పటానికి నిలుచున్నప్పుడు కూడా ప్రత్యర్థులు అతని మాటలను నిశ్శబ్దంగా మంత్రముగ్దుల వలె వినేవారు. లిమాయెగారు

మాట్లాడటానికి నిలబడ్డప్పుడు ఎవరి వంతు వస్తుందో అని అధికార యంత్రాంగం గడగడలాడేది. దండావతేగారు మాట్లాడేటప్పుడు సభ చక్కటి ఉపాధ్యాయుడు పాఠం చెప్తున్న తరగతి గదిలా ఉండేది. లిమాయెగారు పులిలా గర్జిస్తే దండావతేగారు సాధువులా ప్రవర్తించే వారు.

ఇద్దరు మధుల జీవితాలు ఆదర్శమైనవి ఉదాహరణలుగా నిలబడేవి. సోషలిస్టు ఉద్యమానికి నవజీవం కావాల్సిన ఈ రోజున వారిద్దరి జీవితాలను సమన్వయంతో తరచి చూసి దండావతెగారి తేనెతో, లిమాయెగారి నిమ్మరసాన్ని కలిపి సోషలిస్టు ఉద్యమానికి సరైన పాళ్ళల్లో ఆ మిశ్రమాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే అవసానదశలో ఉన్న సోషలిస్టు ఉద్యమం బాగుపడుతుంది. విడివిడిగా కూడా వారిద్దరూ ఎంత గొప్పవారంటే కొత్తతరం సోషలిస్టులకు వారి జీవితాలు ఎంతో కొంత నేర్పుతూనే ఉంటాయి.